
విశాలాంధ్ర
వైయస్ఆర్ కడప జిల్లా అన్నమయ్య జిల్లా

కలమల్ల పంచాయితీలో ఏం జరుగుతోంది..?

-సమగ్ర విచారణకై డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు..
-రికార్డుల అప్పగింతలో జాప్యం..
-నిధులు దుర్వినియోగం అంటున్న స్థానికులు..
-ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని నిర్ణయం..

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామ పంచాయితీలో ఏం జరుగుతోందంటూ అక్కడి ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఈ పంచాయతీ పరిధిలో ఆర్‌టిపిపి ఉన్న నేపథ్యంలో ప్రతి ఏటా సుమారు రూ. 70 లక్షల వరకు పన్నుల రూపంలో ఆదాయం లభిస్తోందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అలాగే కలమల్ల పంచాయతీ పరిధిలోని 3 వాటర్ ప్లాంట్ల నిర్వహణకు కూడా ఏడాదికి రూ.6 లక్షల మేర ఆర్‌టిపిపి నిధులు మంజూరు చేస్తోంది. ఈ స్థాయిలో నిధులు సమకూరుతున్నప్పటికీ ఆశించిన మేరకు అభివృద్ధి పనులు సాధ్యం కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. స్థానికులు సైతం పెదవి విరుస్తున్నారు. పంచాయతీ అధికారులు నిధులను ఓ మేరకు స్వాహా చేస్తున్నారన్న ఆరోపణలు కూడా లేకపోలేదు. ఇటీవల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గ్రామ పంచాయతీకి సంబంధించిన రాబడి, ఖర్చులపై సమాచారం కావాలని ఆర్‌టిఐ ద్వారా కోరగా సదురు రికార్డులు ఆడిటర్ వద్ద ఉన్నాయంటూ సమాధానం పంపడంతో ఆ వ్యక్తి అవాక్కయ్యారు. కాగా ఆర్‌టిపిపి యాజమాన్యం వాటర్ ప్లాంట్ల నిర్వహణకు ఇచ్చే చెక్కులను దారి మళ్ళించి పంచాయితీ సాధారణ నిధులనుండి వాటిని నిర్వహించడం జరుగుతోందన్న వాదన బలంగా వినిపిస్తోంది. పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల కన్నా వారి సంఖ్యను 10 నుండి 12 వరకు పెంచి వారి పేరుతో జీతాల రూపంలో నిధుల స్వాహా జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. రికార్డుల అప్పగింతలో జాప్య మేళ.. ఈ గ్రామ పంచాయతీకి సంబంధించి బదిలీపై వెళ్లే పంచాయతీ అధికారులు అనంతరం కొత్తగా బాధ్యతలు స్వీకరించే వారికి మొత్తం రికార్డులను స్వాధీనం చేయాల్సి ఉంటుంది. కానీ అదేం చిత్రమో గాని ప్రస్తుతం ఇక్కడ ఈ సాంప్రదాయానికి తూట్లు పడ్డట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఓ వేళ పాతవారు కొత్తవారికి రికార్డులు ఇవ్వబోతే వీరు తీసుకోవడం లేదా అన్న ప్రశ్న కూడా ఉదయించక మానదు. గ్రామపంచాయతీ పనితీరును పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు కూడా కలమల్లలో జరుగుతున్న వ్యవహారాలపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయితీ జమ, ఖర్చుల అంశంపై సమగ్ర క్షేత్రస్థాయి విచారణకు పలువురు స్థానికులు పట్టుబడుతున్న నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి ఫిర్యాదు రూపంలో తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అదే సమయంలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని వారు యోచిస్తున్నట్లు సమాచారం. సమగ్ర విచారణ ద్వారానే నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడుతుందని ఇక్కడివారు విశ్వసిస్తున్నారు.

అన్నమయ్య జిల్లా కేంద్రం పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

విశాలాంధ్ర -రాయచోటి : గత మూడు సంవత్సరాలు అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటి పై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రాయచోటి ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది ఆదివారం ప్రజాసంఘాల జేఏసీ నాయకులు టీ.ఈశ్వర్, ఆకుల సంఘం నాయకుడు పి రెడ్డయ్య , ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు , రజక సంఘం అధ్యక్షులు టి.రమేష్, శ్రీనివాసులు, రమణ విలేకరులతో మాట్లాడారు.గత మూడున్నర సంవత్సరాలుగా అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి కొనసాగుతున్నదని ఇక్కడ కలెక్టర్ ఎస్పీ ఆఫీసులను ప్రభుత్వం ఏర్పాటు చేసి బంగ్లాలు ఇతర ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ కూడా స్థిరపడి ఉన్నాయని ఈ పరిస్థితులలో అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని మారుస్తున్నట్లు రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలో కలుపుతున్నట్లు రాజంపేట ను కడపలో కలుపుతున్నట్లు రాయచోటిని మదనపల్లిలో కలుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయని దీనితో మూడు ప్రాంతాల ప్రజలు గందరగోళ్ల పరిస్థితిలో ఉన్నారని ఈ పరిస్థితి పై ప్రభుత్వ ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రజాసంఘాలనాయకులు డిమాండ్ చేశారు.

తిరుపతి డాక్టర్లు ఉచిత సేవలు అందించడం అభినందనీయం- ఎమ్మెల్యే, చైర్మెన్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : తిరుపతి అరవింద్ కార్పోరేట్ ఆసుపత్రికి చెందిన కంటి డాక్టర్‌లు ఆదివారం రాఘవరాజుపురం గ్రామపంచాయితీ పరిధిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వచ్చి పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి, సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి కొనియాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెలలో వర్షం సయితం ఎక్కువ అయినా లెక్క చేయకుండా హెచ్ఎంఎం హైస్కూల్ ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించి కంటి చూపు మందగించిన వారిని గుర్తించి వారికి అందరికీ ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలో ఆపరేషన్ చేయించామన్నారు.వారికి కంటి చూపు ఎలా ఉందని తెలుసుకోవడానికి ఆదివారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కంటి డాక్టర్‌లు కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారన్నారు.కంటి పరిక్షల కోసం వచ్చిన వారికి అన్ని వసతులు కల్పించామన్నారు.ఈ కార్యక్రమంలో సింగమాల రఘునాధరెడ్డి, విశ్వనాధరెడ్డి, మహేంధర్ రెడ్డి, మల్లిఖార్జున రెడ్డి, నరసింహారెడ్డి,రాహుల్ రెడ్డి,బత్తిన వేణుగోపాల్ రెడ్డి,మౌలా పఠాన్,పోకల మణి,భార్గవ్,అకేపాటి సుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మైసూర అమ్మవారు బోనాల జాతర

పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారి బోనాలు సమర్పణ

విశాలాంధ్ర- బ్రహ్మంగారిమతం : మండల పరిధిలోని నేలటూరు గ్రామపంచాయతీ చెందిన కమ్మవారి పల్లెలో వెలిసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ మైసూర అమ్మవారి బోనాల జాతర మహోత్సవము కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వివిధ చుట్టుపక్కల ఉన్న గ్రామాల వారు పెద్ద ఎత్తున అమ్మవారికి మహిళలు పెద్ద ఎత్తున మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో బాణాసంచాలతో అమ్మవారికి ప్రత్యేకంగా బోనాలు సమర్పించారు. అమ్మవారికి ముక్కులు చెల్లించారు. ఉదయం నుండి అమ్మవారి ప్రత్యేక పూజలు అభిషేకాలు వివిధ కార్యక్రమాలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు రు ప్రతి సంవత్సరం గ్రామాల నుండి అంగరంగ వైభవంగా మైసూర అమ్మవారి బోనాల జాతర ను వైభవంగా నిర్వహిస్తున్నామని అమ్మవారి ఆశీస్సులతో మా గ్రామాలు పైరు పంటలు పిల్లలతో సుఖ సంతోషాలతో ఉన్నామని అమ్మవారి బోనాల జాతరకు వివిధ ప్రాంతాల నుండి ప్రతి సంవత్సరం కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ ప్రజలతో అమ్మవారి బోనాల జాతరను రెండు రోజులు పాటు వైభవంగా నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామాయణంపై బి.మఠంలో అవగాహన పోటీ పరీక్షలు

విశాలాంధ్ర -బ్రహ్మంగారిమఠం : ప్రముఖ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో విద్యార్థిని, విద్యార్థులకు, మహిళలకు, పురుషులకు అయోధ్యలో రాముల విగ్రహ ప్రతిష్ఠ రెండవ వార్షికోత్సవ సందర్భంగా చిన్మయ మిషన్,గీత సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షులు అయ్యప్ప, వెంకట సురేష్ బాబు సహాయ సహకారాలతో,రామాయణంపై పరీక్షలు నిర్వహించారు. స్త్రీల విభాగంలో మొదటి బహుమతి సిద్ధమ్మ , రెండవ బహుమతి నికిత దీప్తి స్కూల్, మూడవ బహుమతి ఆర్ సాహితి కడవ,ఆరో తరగతి ఏడవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు సంబంధించి మొదటి బహుమతి తేజస్విని రెండవ బహుమతి దివ్య మూడవ బహుమతి అనన్య ఈ ముగ్గురు దీప్తి స్కూల్ సంబంధించిన వారు, పురుషుల విభాగంలో మొదటి బహుమతి రామతేజ రెడ్డి లిఖిత స్కూల్, రెండవ బహుమతి ఎన్ ప్రకాష్ మైదుకూరు,మూడవ బహుమతి టి సుమంత్ దీప్తి స్కూల్,బహుమతులు పొందారు.ఈ కార్యక్రమంలో సివి సుబ్బారెడ్డి,చెన్నారెడ్డి,ఈశ్వర్ రెడ్డి, రామిరెడ్డి నాగేశ్వర రెడ్డి,నాగిరెడ్డి, బ్రహ్మయ్య నారాయణస్వామి నియోజకవర్గ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు మహిళలు పురుషులు, తదితరులు పాల్గొన్నారు.

శతజయంతి ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయండి :సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య

రాజ్యాంగానికి అర్ఎస్ఎస్, బిజెపితోనే ప్రమాదం : సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమీషన్ చెర్మన్ డాక్టర్ కె నారాయణ

ఎమ్మెల్యేని కలిసిన తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు, కానాల మల్లికార్జునరెడ్డి

విశాలాంధ్ర - బ్రహ్మంగారి మఠం : మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ హైదరాబాద్ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు శాలువ బొకేతో జిల్లా నూతన కడప జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుగా కానాల మల్లికార్జునరెడ్డి ఎన్నికచేయడంతో ఈ సందర్భంగా కానాల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తన పైన నమ్మకంతో పదవి కల్పించిన మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆయనకు రుణపడి ఉంటాను అని పార్టీ కోసం తన వంతు కృషి చేస్తూ రాబోయే ఎన్నికలలో అన్ని మండలాల్లో పర్యటించి పార్టీ కోసం హార్నిశలు కృషి చేస్తానని ఏవిధంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి, నారా చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి యువ నాయకుడు రాష్ట్ర మంత్రులు నారా లోకేష్ గారికి కూడా ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలియజేస్తూ తెలుగుదేశం పార్టీ కోసం తన వంతు కృషి చేస్తానన్నారు నియోజకవర్గ నాయకులు మండల నాయకులకు కలిసి పనిచేస్తానని కార్యకర్తలకు అండగా ఉంటానని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నాను అన్నారు ఈ కార్యక్రమంలో తెలియజేసిన పార్టీ మండల అధ్యక్షులు, చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలుగుదేశం, సీనియర్ నాయకులు సోమిరెడ్డి పల్లె, సహకార పరపతి సంఘం చైర్మన్ యల్లటూరి సాంబశివరెడ్డి పూజా శివ యాదవ్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి క్యాబినెట్‌లో వీఆర్ఏల సమస్యలు చర్చించాలి

సమస్యలు పరిష్కరించుకుంటే సమ్మె తప్పదు

ఏపీ వీఆర్ఏ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ నల్లిపోగు నాగేశం

విశాలాంధ్ర -అట్లూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ)లు దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో మంత్రి వర్గం చర్చించి తగు న్యాయం చేయాలని ఏపీ వీఆర్ఏ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ నల్లిపోగు నాగేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా? 1 రూపాయి కూడా జీతంలో పెంపుదల లేక అర్ధాకలతో ఇంటిల్లపాది అలమటిస్తున్నారని ప్రభుత్వం చర్చల పేరుతో రివ్యూ మీటింగ్ ల పేరుతో కాలయాపన చేయకుండా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో ఎండిపోయి నెర్రెలు భారీ చిద్రమైన వీఆర్ఏ లు కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేదల శ్రేయస్సు కోరే ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు స్పందన కొరకు కోటి ఆశలతో వీఆర్ఏలు ఎదురుచూస్తున్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆకాంక్షల మేరకు ఏర్పడిన కుటుంబ ప్రభుత్వం నిరుపేదలైన వీఆర్ఏలను నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. సమస్యలు పరిష్కరించుకుంటే సమ్మెకు పిలుపునివ్వాల్సి వస్తుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అన్నమయ్య జిల్లాను విడదీస్తే చరిత్రహీనులే..

మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి హెచ్చరిక

(కేడీపీ పోటో 44)

విశాలాంధ్ర - రాయచోటి :అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విడదీయొద్దని, ఒకవేళ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా జిల్లాను రద్దు చేస్తే పాలకులు చరిత్రహీనులుగా మిగిలిపోతారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జిల్లాల పునర్విభజనపై కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం అయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా 2022 ఏప్రిల్ 4న ఏర్పడిన అన్నమయ్య జిల్లాను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షలతో జిల్లాను విచ్ఛిన్నం చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే రాయచోటి ప్రాంతం అభివృద్ధి చెందిందని.. 3వ గ్రేడ్ మున్సిపాలిటీ నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఎదిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ అభివృద్ధిని అడ్డుకోవడం ప్రజలను ఆవేదనకు గురిచేస్తోందన్నారు. రాజంపేట పార్లమెంటు పరిధిలోని మండలాలను కడప జిల్లాలో కలపడం, రాయచోటిని మదనపల్లెకు చేర్చాలని చూడటం పాలకుల విచక్షణ రహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. జిల్లా విచ్ఛిన్నానికి వ్యతిరేకంగా మాట్లాడిన టీసీ నాయకులపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని, ప్రజల సహనాన్ని పరీక్షిస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బ్రిటీష్ కాలం నుంచి ఏర్పడిన ఏ జిల్లా కూడా రద్దు కాలేదు. కానీ, నేడు రాజకీయ స్వార్థం కోసం అన్నమయ్య జిల్లా ఉనికిని దెబ్బతీస్తున్నారు. ఈ నిర్ణయాల వల్ల ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని,అన్నమయ్య జిల్లాను కాపాడుకునేందుకు అవసరమైతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఆర్టీసీ కండక్టర్‌కు,డ్రైవర్‌కు సన్మానం

విశాలాంధ్ర -రైల్వేకోడూరు: మండలంలోని శెట్టిగుంట వద్ద ఎక్స్ ప్రెస్ బస్సులు నిలబడడం లేదు, ఇబ్బందిగా ఉందని స్థానిక బ్యాంకు ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు,వైద్య సిబ్బంది అందరూ బిజెపి మండల అధ్యక్షులు నాగినేని బాలసుబ్రమణ్యం దృష్టికి,సాయిఆచారి కుంభకోణం దృష్టికి తీసుకుపోవడంతో తక్షణం వారు స్పందించి కడప ఆర్టీసీ డిపో మేనేజర్ తో మాట్లాడి ఎక్స్ ప్రెస్ బస్సులు నిలబడడానికి అనుమతి తెచ్చారు. ఆదివారం కడప ఆర్టీసీ డిపో బస్సు డ్రైవర్ కు, కండక్టర్ కు శాలువా కప్పి సత్కరించారు.ఎక్స్ ప్రెస్ బస్సులు నిలబడడానికి అనుమతి తెచ్చిన బాలసుబ్రహ్మణ్యం కు, సాయిఆచారి కుంభకోణంకు ఉద్యోగులు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం కడప జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించి స్వీట్లు పంపిణీ చేసి ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి విజయ జ్యోతి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన, చేస్తున్న కార్యక్రమల గురించి కాంగ్రెస్ పార్టీ 1885లో ఆవిర్భవించిందని దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిందని, భారతదేశానికి స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం వంటి విలువలను అందించిన ఘన చరిత్ర పార్టీ దని అంతేకాకుండా మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వంటి మహానేతల త్యాగాలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని ప్రస్తుత పరిస్థితుల్లో దేశాన్ని ఐక్యతతో ముందుకు నడిపించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు మరింత అవసరమని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి నాయకత్వంలో బలోపేతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రెటరీ అలీ ఖాన్, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ పీర్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు, కాంగ్రెస్ పార్టీ అట్లూరు మండల అధ్యక్షుడు శీలం గంగయ్య, కడప నగర డివిజన్ ఇంచార్జ్‌లు జాబీర్ అలీ, అన్వర్, దాసరి శ్రీనివాసులు, అంజన్ కుమార్ యాదవ్, షామీర్ హుస్సేన్, సయ్యద్ ముబారక్ బాషా, రఫీ ఖాన్, హమీద్, సర్దార్ భాష, కరీం, రహమతుల్లా, కమల్ భాష,జోహార్ భాష, ఫజిలుల్లా, హరిప్రసాద్, మహమ్మద్ షాహిబ్ ఖాజా పిర్, సిద్ధిక్, క్రిస్టియన్ మైనారిటీ నాయకురాలు సంజయ్ కాంత, గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మూలె రామముని రెడ్డికి ఆటా ఎక్సలెన్సీ అవార్డు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: హైదరాబాద్ రవీంద్ర భారతిలో "ఆటా వేడుకలు గ్రాండ్ ఫినాలే" వైభవంగా జరిగాయి. ఆటా వేడుకలు కార్యక్రమాల్లో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు ఆటా అవార్డులు ప్రదానం చేసింది. సాహితీ రంగానికి విద్యా రంగానికి సేవలు చేసి నందుకు డాక్టర్ మూలె రామ ముని రెడ్డికి "ఆటా ఎక్సలెన్స్ ఇన్ లిటరరి అండ్ ఎడ్యుకేషన్" అవార్డును ప్రదానం చేసి, శాలువాతో సన్మానించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరయ్యారు. ఆటా అధ్యక్షులు చల్లా జయంత్,ముదిరెడ్డి జయప్రకాష్, సతీష్ రెడ్డిల సారథ్యంలో అత్యంత వైభవోపేతంగా జరిగాయి. గవర్నర్ తన ప్రసంగంలో అమెరికాలో తెలుగువారి పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు సంస్కృతీ, సంప్రదాయాలు, జరుపుకుంటూ, తెలుగు జాతి ప్రాభవ, వైభవాలు, విశ్వ వ్యాప్తం చేస్తున్నందు కు ప్రశంశించారు. అనంతరం ఆటా నిర్వాహకులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తు ముగించారు.

సామాజిక సేవా కార్యక్రమాలను వేగవంతం చేస్తాం

దూదేకుల, నూర్ భాషా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వి ఖాదరయ్య

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : దూదేకుల నూర్ భాషా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను వేగవంతం చేస్తామని దూదేకుల నూర్ భాషా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వి.ఖాదరయ్య, ప్రధాన కార్యదర్శి వి.మస్తాన్ సాహెబ్ పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని ఎర్రముక్కపల్లె సమీపంలోని బాల వికాస్ స్కూల్ వెనుక భాగంలో నీ దూదేకుల భవన్లో వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూదేకుల నూర్ భాషాల సంక్షేమానికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి 60 మందికి పైగా తల్లిదండ్రులు హాజరు కావడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. అనంతరం దూదేకుల భవన్ కమిటీ అధ్యక్షులు ఆయిల్ మిల్ ఓబులేసు మాట్లాడుతూ దూదేకుల సంక్షేమానికి ముందు వరుసలో ఉంటానని తెలిపారు. దూదేకుల భవన కమిటీ ఇచ్చిన పిలుపునకు ఇంతటి రీతిలో స్పందన ఉంటుందని ఊహించలేదన్నారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోశాధికారి వై అజ్మతుల్లా, ఆర్డబ్ల్యూఎస్ మస్తాన్, రిటైర్డ్ టీచర్ పి సుభాన్ , పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమాజ సేవలో హిందువులు ముందుండాలి :బ్రహ్మశ్రీ కృష్ణమాచార్య

విశాలాంధ్ర-చెన్నూరు : సమాజ సేవలో ఎల్లప్పటికీ హిందువులు ముందుండాలని, ఎప్పటికీ వెనకడుగు వేయకూడదని స్వామీజీ బ్రహ్మశ్రీ కృష్ణమాచార్య గురూజీ తెలిపారు. రాష్ట్రీయ స్వయం సేవక సంఘం ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చెన్నూరు ఉపఖండం ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని చేపట్టింది. హిందూ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన జీఎన్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ హిందువుల పరిస్థితి రోజురోజుకు దిగజారి పోతుందని, ఐకమత్యం లేకపోతే హిందువులకు బంగ్లాదేశ్ లో హిందువులకు పట్టిన గతే మనకు పడుతుందని, మనమీద దాడి జరిగినప్పుడు ఎదురు దాడికి జరిగితేనే మనకు జీవితం ఉంటుందని లేకపోతే పతనం తప్పదన్నారు. ప్రతి ఇంట్లో కుటుంబం అలవాట్లు మార్చుకోవాలని కుటుంబమంతా కలిసి కార్యక్రమాలలో పాల్గొనాలని వారంలో కనీసం రెండు మూడు రోజులలోన కుటుంబంతో గడపాలని పిల్లలు ఏమి చేస్తున్నారో గమనించాలని వారికి సరైన మార్గ నిర్దేశం చేయాలన్నారు. వేలాదిమంది హిందూ బంధువులు పాల్గొన్నారు. ఇందు సమ్మేళన కమిటీ ఆధ్వర్యంలో వచ్చిన అతిథులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా తగు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్పీ ప్రాంత సంఘటన మంత్రి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్రీయ స్వయంసేవ సభ్యురాలు భూమిరెడ్డి మాధవి లత హిందూ సమ్మేళన కమిటీ సభ్యులు కల్లూరు విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

జనవరి 10న తిరుపతిలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర మహాసభలు



విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: బ్యాంకులలో వేల కోట్ల రుణాలు తీసుకుని ఎగవేసిన వారంతా దేశభక్తులు గా, రాజ్యాంగం హక్కుల కోసం పోరాడే వారంతా అర్బన్ నక్సలైట్లనే ముద్ర వేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా గొంతుకలను నొక్కేస్తు న్నాయని పౌర ప్రజా స్వామ్యపు హక్కుల సంఘాలు నేతలు విమర్శించారు. స్థానిక సృజన సామాజిక వేదిక కార్యాలయంలో జనవరి 10న తిరుపతిలో జరిగే పౌరహక్కుల సంఘం 20 రాష్ట్ర మహాసభల పోస్టర్స్ ను ప్రజాసంఘాల నేతలు ఆధ్వర్యంలో ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసమ్మతి ధికారమనేవి ప్రజాస్వామ్య సంస్కృతిలో భాగం అన్నారు. కానీ కేంద్రంలోని బిజెపి ఫ్యాసిస్టు పాలకులకు ఇవి ఎంత మాత్రం గిట్టవని అందుకే ప్రజాస్వానికి వాదులను నక్సలైట్లు, టెర్రరిస్టులను ముద్ర వేసి దేశంలో అనేక చోట్ల పెరుగుతున్న అసమ్మతిని దిక్కర భావనలను క్రూరంగా అనిచివేస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు లెక్చలర్ సురేష్ బాబు, దళిత సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మురళి, జన విజ్ఞాన వేదిక కార్యదర్శి రాజేష్, సిఎం ఎస్ పద్మ , విరసం వరలక్ష్మి, విద్యావంతుల వేదిక ఎస్పీ మహమూద్, పీకేఎస్ శ్రీనివాసులురెడ్డి, నాగేంద్ర బిఎస్ఎస్ జై చంద్ర, వెంకటరెడ్డిలు, మహిళా శక్తి వడ్ల లక్ష్మీదేవి, ఆర్వీఎస్ హరిత పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర -కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల యందు 1988 నుండి 1993 మధ్యకాలంలో ఆరు నుండి పదవ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనానికి సుమారు నూరు మంది పూర్వ విద్యార్థులతో పాటు,అప్పటి ఉపాధ్యాయులైన బి.సిద్దయ్య టి.మాలకొండయ్య, ఎం.ఏసుదాసు, ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.వి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గురువులను మెయిన్ గేటు నుండి పూలు చల్లుతూ పూర్వ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. తదనంతరం వేదిక పైన భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులందరూ కార్యక్రమంలో బాల్యం నాటి మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ పరిచయం చేసుకోవడం జరిగినది.తమ అభివృద్ధిలో ఉపాధ్యాయులు చేసిన కృషి,వారు నేర్పిన విద్యాబుద్ధులు, క్రమశిక్షణ ఎప్పటికీ మరువలేమన్నారు.పూర్వ ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ బ్యాచ్ లోని విద్యార్థిని, విద్యార్థులు చదువులో బాగా రాణించి,ఉన్నత స్థానాలలో స్థిరపడినందుకు చాలా సంతోషిస్తున్నామన్నారు.32 సంవత్సరాల తర్వాత జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రాలు,జిల్లాలు దాటి పాల్గొన్న విద్యార్థులకు ఆశీస్సులు తెలియజేశారు. తదనంతరం పాఠశాలకు సుమారు 50వేల రూపాయల విలువచేసే బీరువాలు,మైక్రోస్కోప్ ప్రధానోపాధ్యాయులు ఎన్.వి.రమణయ్య,సైన్స్ ఉపాధ్యాయులు జి.చెన్నారెడ్డి,డి.గురప్పలకు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.వి.రమణయ్య మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంలో కూడా పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారం అందించాలన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా,ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొన్నారు.ఈ బ్యాచ్‌లోని పూర్వ విద్యార్థులైన ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి,ఎస్టియు రాష్ట్ర నాయకుడు పి.రమణారెడ్డి,ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ బి.వి.రాజకిషోర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది కాకర్ల చెన్నారెడ్డి,ఉపాధ్యాయుడు కేజే ప్రవీణ్ కుమార్, పూర్వ విద్యార్థులు తిరుపాల్ రెడ్డి,లక్ష్మి,సునంద,విజయలక్ష్మి రాజేశ్వరి,రోశిరెడ్డి, మార్కారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి,మౌలాలి, ఓబయ్య,అబ్దుల్ ఖాదర్, బి.శేఖర్,నాయబ్ రసూల్, జెడ్.శ్రీనివాసులు,వెంకట సుబ్బారెడ్డి,రంగయ్య,బాలుడు, సదానంద్, సింగరయ్య, వెంకట్రామయ్య,జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై ఎన్ఎస్ఎస్ విద్యార్థుల అవగాహన

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమం నందు గల శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం రాజుపాలెంలో రహదారిపై భద్రత కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ, విద్యార్థులు గ్రామంలో ఇంటింటికి తిరిగి రోడ్డుపై వాహనాల్లో ప్రయాణించే టప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరిం చారు. అలాగే ప్రధాన మార్గం నందు వస్తున్నటువంటి ప్రయాణికులను ఆపి హెల్మెట్ ధరించకుండా వస్తున్న టువంటి వారందరికీ హెల్మెట్ యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ మన శరీరంలో చేతులకి, కాలికి దెబ్బ తగిలిన విరిగిన దాన్ని తిరిగి అతికించుకోవచ్చు కానీ తలకు దెబ్బ తగిలితే దాన్ని మనం తిరిగి పొందలేంకాబట్టి మన శరీరంలో తల చాలా సున్నితమైనటువంటిది అది ఇంజురైతే దాన్ని మళ్లీ మనం సరి చేసుకోలేము కాబట్టి బైక్ నందు ప్రయాణించే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి అన్నారు. వాహనంలో ముగ్గురు వెళ్లడం చేయకూడదని, డ్రంక్ అండ్ డ్రైవ్ కూడా చేయకూడదు, బైక్ నందు ప్రయాణిస్తున్న సమయంలో సెల్ ఫోన్ మాట్లాడుకుంటూ వెళ్లకూడదు, ఇలా సూచనలు విద్యార్థిని విద్యార్థులు రాజుపాలెం గ్రామ ప్రజలందరికీ అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సిద్దయ్య పాల్గొని ప్రయాణికు లకు, వాహనదారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పర్లపాడు గౌరీ శంకర్, మౌనయ్య ఆచారి మరియు ఎన్ఎస్ఎస్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

నేడు సభాభవన్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణ

ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి ఉ.10 గంటల వరకు

డయల్ యువర్ కలెక్టర్

ఫోన్ చేయవలసిన ల్యాండ్ లైన్ నెం.08562-244437

డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్ కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిఆర్వో కోరారు.

సభాభవన్‌లో పిజిఆర్ఎస్ నిర్వహణ

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చును.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

సేవా కార్యక్రమాలకు సహకారం అవసరం

మానవతా వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి

విశాలాంధ్ర -సుండుపల్లె : సేవా కార్యక్రమాలకు కార్యవర్గాలకు సభ్యులందరు సహకరిస్తూ చక్కని కార్యక్రమాలు నిర్వహించాలని మానవతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రా రెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రమైన సుండుపల్లె ప్రాథమిక తెలుగు పాఠశాల ఆవరణలో జరిగిన సుండుపల్లె మండల మానవతా సంస్థ ఆత్మీయ సమావేశంలో మానవతా సుండుపల్లె క్యాలెండర్ ను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఏడాది సభ్యత్వాలు పెంచాలని అందరూ సహకరిస్తూ సేవా కార్యక్రమాలతో పాటు ఆత్మీయ నైతిక సహకార కార్యక్రమాలను చేయాలని సూచించారు.ఇందులో భాగంగా మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలో మానవతా సంస్థ కార్యవర్గ ప్రతినిధులు, సభ్యులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామాలయంలో గోవింద భజనలు..సీతారాములకు అభిషేకం

విశాలాంధ్ర - సుండుపల్లె : డిసెంబర్ మండల పరిధిలోని మడితాడు పంచాయతీ నాయునివారిపల్లెలో మాలధారణ భక్తులు భజనలు చేశారు.శనివారం రాత్రి సుండుపల్లె లోని సీతారామ ఏజెన్సీస్ నిర్వాహకులు గోవింద మాలధారణ భక్తుడు కేశవ నాయుడు,ఆయన సోదరుడు శ్రీ కన్న నాయుడు కుటుంబసభ్యులు తమ గ్రామం నాయుని వారి పల్లె లోని రామాలయంలో సీతా రామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు అభిషేక పూజలు చేసి అలంకరించారు.భజనలలో భాగంగా వెంకటేశ్వర స్వామి చిత్ర పటం, సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వాముల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కొలువు దీర్చి పూల మాలలతో అలంకరించారు. కలశాన్ని ఏర్పాటు చేసి కలశ, వినాయక పూజలు పూర్తిచేసి భజనలు ప్రారంభించారు. ఇందులో భాగంగా గోవింద, అయ్యప్ప గురు స్వాములు, మాలధారణ భక్తులు స్వామి అమ్మవార్ల ను స్మృతిస్తూ పాటలు గేయాలు ఆలపించారు. భజనల అనంతరం పలువురు గురువులకు పూజ నిర్వాహకులు కేశవ నాయుడు, శ్రీకన్న నాయుడు కుటుంబ సభ్యులు శాలువాలతో సన్మానించారు. భజనలకు వచ్చిన భక్తులు గ్రామస్థులకు అల్పాహార ప్రసాదం ఏర్పాటు చేశారు.

మాధవరం-1లోని శ్రీ భద్రావతి భావనారాయణ ఆలయంలో ఘనంగా హిందూ సమ్మేళనం

విశాలాంధ్ర-సిద్దవటం : ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మాధవరం-1 గ్రామంలో వెలసిన శ్రీ భద్రావతి భావనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం ఘనంగా హిందూ సమ్మేళనాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శివదర్శనానంద సరస్వతి మాతాజీ విచ్చేశారు. ముందుగా ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాతాజీ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడటం మనందరి బాధ్యతగా తీసుకోవాలని పిల్లలకు చిన్న వయసు నుండే భగవద్గీత, రామాయణం, భారతం లాంటి గ్రంథాలు మన సంస్కృతులు, సాంప్రదాయాలను నేర్పించాలని సూచించారు. హిందువులంతా ఏకతాటిపైకి వచ్చి ప్రపంచానికి హిందూ శక్తిని ఐక్యతను చూపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల నాట్య ప్రదర్శన, గీతా పారాయణ పఠనం అందరినీ ఆకట్టుకున్నాయి. ఇందులో పాల్గొన్న పిల్లలకు మాతాజీ చేతుల మీదుగా బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో మాధవరం-1 గ్రామ పంచాయతీలోని అన్ని గ్రామాల ప్రజలు, మహిళలు, విద్యార్దులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యం: వైసిపి

విశాలాంధ్ర-పులివెందుల: 2025లో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమని వైసిపి వ్యాఖ్యానించింది. పులివెందుల ప్రాంత అభివృద్ధిపై టిడిపి ఇన్‌చార్జి బిటెక్ రవి వ్యాఖ్యలు ఆక్షేపణీయమని వెల్లడించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ 2025 సంవత్సరం పొడవునా అక్రమ మైనింగ్, ఇసుక మాఫియా, రేషన్ మాఫియా, జూదం, దొంగతనాలతో టీడీపీ నాయకులు జేబులు నింపుకున్నారన్నారు. ఎక్కడ చూసిన జూద స్థావరాలు,దొంగతనాలు చివరకు ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం కూడా అక్రమంగా రవాణా చేసుకొని ప్రజా ధనాన్ని దోపిడీ చేశారన్నారు. 2025 వ సంవత్సరం సాక్షాత్తు కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన జాతీయ వైద్య కమీషన్ పులివెందుల మెడికల్ కళాశాల కు ఇచ్చిన 50 సీట్లను కూడా రద్దు చేసి తమ జేబులు నింపుకోవడానికి కళాశాలను ప్రైవేట్ పరం చేయాలని, కొన్ని వందల మంది రాయలసీమ విద్యార్థుల కడుపు కొట్టారన్నారు. ప్రజలకు తాగునీటి సరఫరా అనేది నిరంతర ప్రక్రియ, ప్రతి 6 నెలలకు ఒకసారి వైఎస్సార్ నిర్మించిన నక్కలపల్లి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి పంపింగ్ చేసే మోటార్ లు మరమ్మత్తులు గురికావడం మళ్లీ వాటిని పునరుద్ధరించడం సహజం వీ టన్నింటికి పరిష్కారంగా పులివెందుల పట్టణం తో పాటు ప్రతి ఒక్క గ్రామానికి త్రాగు నీరు అందించాలనే ఉద్దేశంతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టి ఆయన హయాం లో దాదాపు 60 శాతం పనులు, 90 శాతం మెటీరియల్ సరఫరా చేసిన పులివెందుల ఇంటిగ్రేటెడ్ వాటర్ ప్రాజెక్ట్ ను 2025 సంవత్సరంలో కూడా పూర్తి చేయకపోవడం దురదృష్టకరమన్నారు. 2025 సంవత్సరంలో ఈ కూటమి ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా పులివెందుల ప్రాంతానికి నిధులు రాకపోవడం శోచనీయమన్నారు. జగన్ పర్యటన తరువాత అసలు అరటి పంట ధరలే పడిపోలేదు జగన్ రాజకీయ స్టంట్ అని ప్రెస్ పెట్టిన నువ్వు ఇప్పుడు నార్త్ కు, జమ్ముకశ్మీర్ కు హార్టికల్చర్ అధికారులను పంపి ధరలు పెరిగేట్లు చేశామని చెప్పడం సిగ్గుచేటన్నారు. 2025 వ సంవత్సరంలో టీడీపీ దళారుల చేతి వాటం వలన రైతులు ఏ పంట వేసిన మార్కెట్‌లో ధరలు లేకపోవడం, ప్రభుత్వం నుంచి మద్దతు ధర లేకపోవడం తో అరటి, టమోటా, ఉల్లిపాయ లను దిబ్బలు గా పడేసిన దుస్థితి వచ్చింది అని గుర్తు చేశారు టీడీపీ జెండాలు పీకారనే నెపం తో ముక్కుపచ్చలారని చదువుకునే మైనర్ బాలుర పైన పాశవికంగా ప్రవర్తించి వారిపై అక్రమంగా హత్యాయత్నం కేసులు పెట్టించి జువైనల్ కారాగారానికి పంపిన ఘటన ఈ ఏడాది లో జరిగింది అని గుర్తు చేసారు గతం లో ఏమీ మాట్లాడావో ఇప్పుడు ఏం మాట్లాడుతున్నావో తెలుసుకొని మాట్లాడితే బాగుంటుంది అని , నీ స్నేహితుడు ఇచ్చిన స్క్రిప్ట్ చదివితే ప్రజల ముందు అపహాస్యం అవుతావని , సలహాలు ఇచ్చే నీ మిత్రుడు అన్ని విధాలా సంవృద్ధిగా ఉన్నాడంటే అది వైయస్ కుటుంబం చలువే అని తెలియచేసారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైసిపి నాయకులు నాగేళ్ల సాంబశివారెడ్డి, బయపురెడ్డి, పార్నపల్లె కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గారు న్యాయం చేయండి.. మా కుమార్తెను రక్షించండి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండలం సీతంపల్లె గ్రామానికి చెందిన వెంకట లక్షుమ్మ కుమార్తె మైనర్ బాలికను చాపాడు మండలం రామదాసు గ్రామానికి చెందిన రాకేష్ అనే వ్యక్తి మా ఇంటి వద్ద నుండి రాత్రి సమయంలో తీసుకెళ్లాడని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని, జిల్లా ఎస్పీని కలిసి విన్నవించామని జిల్లా ఎస్పీ మాకు న్యాయం చేయాలని బాధితురాలి తల్లి కోరారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మా కుమార్తెను 8 రోజుల క్రితం తీసుకెళ్లారని ఇంతవరకు నా బిడ్డ ఆచూకీ తెలియలేదని ఆమె రోదించారు. జిల్లా ఎస్పీ కలగజేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

వైభవంగా అంబలం పూజ

విశాలాంధ్ర-వాల్మీకిపురం : పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉపసర్పంచి కేశవరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్పస్వామ వారికి అంబలం పూజను వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహానికి కనుల పండువగా పంచామృతాభిషేకం, అంబలం నిర్మించి అందులో అయ్యప్ప స్వామి, సుబ్రహ్మణేశ్వర స్వామి, వినాయక స్వామిని అధిరో హింప జేసి విశేష పూజలు, అయ్యప్ప స్వామి వారి భజనలను స్వామి వారి దీక్షను స్వీకరించిన భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు ఈ సందర్భంగా మాల దీక్షాపరు లకు బిక్షను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి టమోటా రామచంద్ర, నిర్వాహకులు బీవీ. రెడ్డి, మోహన్రెడ్డి, అయ్యప్పస్వామి దీక్ష చేపట్టిన స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కేటాయించిన ఎమ్మార్పీ ధరలకే యూరియా

విశాలాంధ్ర-వాల్మీకిపురం : మండలంలో ప్రస్తుత రబీ సీజన్లో వరి, పశుగ్రాశం సాగు పెరుగుదల దృష్ట్యా అధికారులు 35.5 మెట్రిక్ టన్నుల యూరియాను రైతుల కోసం కేటాయించారని స్థానిక వ్యవసాయాధికారి మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వాల్మీకిపురం, విఠలం, చింతపర్తి, మంచూరు, మూరేవాండ్లపల్లె రైతు సేవా కేంద్రాలలో పంపిణీకి యూరియా సిద్ధంగా ఉందన్నారు. సోమవారం నుంచి రైతులు ప్రభుత్వం కేటాయించిన ఎంఆర్పీ ధరలకే యూరియాను పొందవచ్చునని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

విశాలాంధ్ర -ముద్దనూరు : మండల కేంద్రం లోని స్థానిక పోలీస్ స్టేషన్లో సిఐ నాగేష్ బాబు పోలీస్ సిబ్బందితో కలిసి మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇకనుండి అనవసర గొడవలకు, వివాదాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో జీవనం సాగించాలని రౌడీ షీటర్లకు హెచ్చరించారు. ఎవరైనా గొడవలు గాని అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నాలు చేస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా పేకాట, అక్రమ మద్యం, గుట్కాలు, గంజాయి విక్రయించడం లాంటివి ఎక్కడైనా జరుగుతున్న పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వర్థ నాయుడుకు మానవతా నివాళి

విశాలాంధ్ర - సుండుపల్లె : మండల కేంద్రమైన సుండుపల్లె సాయన్నగారిపల్లె కు చెంది తిరుపతి సురేష్ రెసిడెన్సీ అధినేత మాలేపాటి అశ్వర్థ నాయుడు మృతదేహానికి సుండుపల్లె మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నివాళులర్పించారు.ఆదివారం సాయన్నగారిపల్లెలోని అశ్వర్థ నాయుడు మృతదేహం పై మానవతా సంస్థ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఏఐటీయుసి జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-వేంపల్లి: వచ్చే ఏడాది జనవరి 25 26 27వ తేదీలలో కడప నగరం నందు నిర్వహించనున్న ఏఐటియుసి 12వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బల్లారపు రామాంజనేయులు, అంబేద్కర్ గురుకుల పాఠశాలల యూనియన్ జిల్లా కార్యదర్శి బ్రహ్మం, భవన కార్మిక సంఘం యూనియన్ నాయకులు బాలాజీ, బాబా ఫక్రుద్దీన్, నాగేశ్వరరావు, త్రిబుల్ ఐటీ సెక్యూరిటీ గార్డ్ యూనియన్ నాయకులు రత్నమయ్య, బాబ్జాన్, మల్లేష్, అంజనప్పలు కోరారు. ఆ మేరకు వారందరూ వేంపల్లి లో ఆదివారం కరపత్రాలను పంపిణీ చేశారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

విశాలాంధ్ర-పులివెందుల: స్థానిక అహోబిలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం సందర్భంగా మానసిక ఆరోగ్యంపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి నాగేంద్రమ్మ ఆధ్వర్యంలో యోగా గురువు వెంకటరామిరెడ్డి యోగాపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రముఖ సర్జన్ డా.సుకన్య మాట్లాడుతూ బాలికా దశ నుండే మంచి ఆహారపు అలవాట్లతో విద్య లో రాణించాలని, తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా ఆశయ సాధన లక్ష్యం గా ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. స్త్రీ లకు కలిగే వివిధ రకాల రుగ్మతులు మరియు వాటి నివారణ ఉపాయాలను వాలంటీర్లకు అవగాహన కల్పించారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ బాలికలు, మహిళలు మానసిక ఒత్తిడికి లోను కాకుండా చదువుతో పాటు ఆట పాటలలో రాణించి, శారీరకంగాను, మానసికంగాను దృఢంగా ఉండాలని తద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మాధవి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర - పీలేరు : పీలేరు పట్టణం మల్లెల వారి వీధిలో ఉండే మాధవి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో పీలేరు మండలం తలపలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరంలో నిర్వహించినట్లు మాధవి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్ రెడ్డి పేర్కొన్నారు ఈ ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 100 మందికి పైగా చికిత్సలు చేయించుకున్నారని తెలిపారు మాధవి హాస్పిటల్ డాక్టర్ ఎ.మాధవి ఏంఎస్, ఓబిజి, ఎఫ్ఆర్ఎం వారు స్వయాన చికిత్సలు చేయించి ఉచిత మందులను పంపిణీ చేశారని తెలిపారు. ఇందులో ముఖ్య విశేషం ఏమంటే ఎంతోమంది దంపతులు అవగాహన లోపం వల్ల వారికి తెలియని చిన్నచిన్న అనారోగ్య కారణాలతో సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకునే సౌకర్యం లేక సంతానం పొందలేక ఎన్నో ఆటుపోట్లకు గురవుతున్న సందర్భంలో మాధవి హాస్పిటల్ వారు ప్రముఖ వైద్యులు మాధవి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరం నందు పిల్లలు లేని దంపతులకు, గర్భాశయ సమస్యలు ఎక్కువగా రక్తస్రావం తెల్లబట్ట ఇరుకులర్ పిరియడ్స్ అండాశయంలో గడ్డలు ట్యూబ్స్‌లో సమస్యలకు ఉచితంగా చూసామని తెలిపారు. పీలేరు పరిసర ప్రాంతాల వారు వచ్చి ఈ శిబిరంలో పాల్గొని ఉచిత చికిత్సతో పాటు ఉచిత మందులు పొందాలని తెలిపారు. అదే విధంగా తమ ఆసుపత్రిలో మొట్టమొదటిసారిగా అత్యాధునిక అందుబాటులో ఐయూఐ ల్యాబ్ సౌకర్యం కలదని ఈ అవకాశాన్ని పీలేరు పట్టణ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

ప్రతి మనిషికి కేలండర్ ఎంతో అవసరం

విశాలాంధ్ర కేలండర్ ఆవిష్కరణలో తులసిరెడ్డి వెల్లడి

విశాలాంధ్ర-వేంపల్లి: ప్రతి మనిషికి కేలండర్ ఎంతో అవసరమని మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లిలో ఆదివారం 2026 విశాలాంధ్ర నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేలండర్ ఆధారంగానే వారి దైనందిన కార్యక్రమాలను తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో విలేకరి అమర్‌నాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ, చక్రాయిపేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి,గండి క్షేత్రం మాజీ చైర్మన్ ఎస్వి రమణ,,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు, రవి, బద్రి రాఘవయ్య,వేమయ్య, నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర- పీలేరు :పీలేరు మానవత చేస్తున్న సామాజిక సాంఘిక సేవలు ప్రశంసనీయమని పీలేరు రౌద్రాల అంకాలమ్మ ఆలయ అధ్యక్షులు రామకృష్ణా రెడ్డి తెలిపారు. మానవత నెలవారి సమీక్ష సమావేశం కార్యదర్శి శెట్టి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన చైర్మన్ వి.రామచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మానవత చేస్తున్న ఫ్రీజర్ బాక్స్ వితరణ, శాంతిరథం వితరణ, బీదలకు, రోగగ్రస్థులకు ఆర్థిక సహాయం, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ వివిధ సేవా కార్యక్రమాలు ప్రసంసనీయంగా ఉన్నాయని, అవి మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి తన వంతు సహాయ సహకారాలు అందించగలరని కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథి డి.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ మానవత చేస్తున్న సేవలో ముఖ్యంగా సిమెంట్ బెంచీలు ఏర్పాటు చాలా మంచి కార్యక్రమం అని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కో చైర్మన్ కృష్ణమూర్తి, కోశాధికారి జగన్మోహన్, డైరెక్టర్ పోతంశెట్టి రమేష్, కన్వీనర్ యర్రంశెట్టి వెంకటరమణ, సభ్యులు ఎం.నాగరాజ, వై.వెంకటరమణ రెడ్డి, జీవి రమణ, సి. రామమూర్తి, ఆర్.విజయ మహేష్, పోస్ట్ జీవి రమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అల్పాహారం పంపిణీ జరిగినది. పీలేరు పట్టణంలో మానవతా సిమెంట్ బెంచీల పంపిణీ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందున్న పీలేరు మానవత సంస్థ పీలేరు పట్టణంలో రెండవ విడతగా 54000/- విలువచేసే 15 సిమెంట్ బల్లలు(బెంచీలు)లను ఏర్పాటు చేసినట్లు చైర్మన్ డాక్టర్ వి.రామచంద్ర తెలియజేశారు.తిరుపతి రోడ్‌లోని ఆంజనేయస్వామి గుడి, బండ్లబంకలోని రామాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, శ్రీనాథపురంలోని మహమ్మదీయ స్మశానం, గాడ్లపల్లి, కోటిగారిపల్లి,రామాలయాలలో మదనపల్లి రోడ్లోని చెన్న కేశవస్వామి గుడి వద్ద పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు. వీరిలో బివి సురేష్ 2, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి 1, వి.రామచంద్ర 2, ఆర్.నాగారత్నమ్మ 1 (మొత్తం 6) బెంచీలు వితరణగా అందజేశారు.

మాజీ సీఎం నల్లారి కిరణ్ హైదరాబాద్ పర్యటన వాయిదా

విశాలాంధ్ర - పీలేరు : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఆదివారం హైదరాబాద్ వెల్లవలసి ఉంది. అయితే అనివార్య కారణాల వలన నేడు వాయిదా పడింది. కావున సోమవారం మధ్యాహ్నం 3గంటల వరకు కలికిరి బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలకు మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అందుబాటులో ఉంటారు. అనంతరం సోమవారం రేణిగుంట విమానాశ్రయం నుంచి బయలుదేరి హైదరాబాద్ వెళ్లనున్నారని ఆయన వ్యక్తిగత పిఏ.క్రిష్ణప్ప తెలిపారు.

' పల్లె ' కు -చల్లని గాలి

- పల్లెవెలుగు బస్సులలో ఏయిర్ కండిషన్ - దశలవారీగా నడిపే ప్రయత్నం
- తొలివిడత 1450 బస్సులను నడిపే యోచన - వచ్చే ఏడాది నుంచి అమలుకు శ్రీకారం

విశాలాంధ్ర-పులివెందుల: వచ్చే ఏడాది నుంచి పల్లె ప్రాంతాలకు చల్లని గాలి వీయనుంది. ఈ ప్రక్రియ దశలవారీగా నడిపేందుకు ప్రభుత్వం ప్రయత్నం సాగిస్తోంది. తొలివిడత రాష్ట్రవ్యాప్తంగా 1450 పల్లె వెలుగు బస్సులను నడపాలని ప్రభుత్వం యోచిస్తుంది. ఈ ప్రక్రియ మరి ఎంతో దూరం లేదు. వచ్చే ఏడాది నుంచి అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పల్లె వెలుగు బస్సులలో కొన్ని వాటిని ఈవీ ఏసి (ఎలక్ట్రానిక్ వెహికల్ ఎయిర్ కండిషన్) బస్సులుగా మార్చేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాపక్ష పాలనకు మరో బలమైన ముద్ర గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం మరో అడుగు వేసింది. ఇప్పటివరకు పట్టణాలకే పరిమితమైన ఎయిర్‌కండిషన్డ్ బస్సు సేవలను ఇకపై 'పల్లె వెలుగులు' పరిధిలోకి తీసుకొస్తూ, గ్రామీణ రవాణా వ్యవస్థకు కొత్త ఊపిరి పోసింది. ఇది కేవలం రవాణా నిర్ణయం మాత్రమే కాదు. పల్లె ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతాభావానికి నిదర్శనం.గ్రామీణ ప్రాంతాలంటేనే అసౌకర్యాలు, ఎండచలి తట్టుకుంటూ ప్రయాణం చేయాల్సిందే అన్న భావనకు ఈ నిర్ణయం గట్టి సమాధానం చెబుతోంది. పల్లె ప్రజలూ పట్టణ ప్రజలతో సమానంగా నాణ్యమైన సౌకర్యాలకు అర్హులేనన్న ప్రభుత్వ దృక్పథం ఈ విధానంలో స్పష్టంగా కనిపిస్తోంది.ఏసి బస్సు సేవలను హడావుడిగా కాకుండా, ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న గ్రామీణ మార్గాల్లో ముందుగా ప్రారంభించి, అనంతరం ఇతర ప్రాంతాలకు విస్తరించాలన్న నిర్ణయం ప్రభుత్వ పాలనా పరిపక్వతను ప్రతిబింబిస్తోంది. ప్రజల అవసరాలను గమనిస్తూ, అనుభవాల ఆధారంగా ముందుకెళ్లాలన్న ఆలోచన ప్రశంసనీయం.

సౌకర్యాలు భద్రతకు ప్రాధాన్యం

ఈ ఏసి బస్సుల్లో సౌకర్యవంతమైన సీట్లు, ఎయిర్‌కండిషనింగ్, మెరుగైన భద్రతా చర్యలు, పరిశుభ్రతకు పెద్దపీట వేయనున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణించేలా బస్సులను రూపకల్పన చేయడం ప్రభుత్వ సామాజిక బాధ్యతను చాటుతోంది. ప్రయాణికులకు ప్రత్యక్ష లాభం ఈ నిర్ణయంతో వేసవిలో మండే ఎండలు, చలికాలంలో తీవ్ర చలి నుంచి ఉపశమనం లభించనుంది. రైతులు, కూలీలు, విద్యార్థులు, ఉద్యోగులు ఇకపై అలసటలేని ప్రయాణాన్ని అనుభవించగలుగుతారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకు చేరువ పెరిగి, పల్లె పట్టణ అంతరం తగ్గే అవకాశాలు మెరుగుపడతాయి. పర్యావరణ పరిరక్షణకూ ఈ చర్య తోడ్పడనుంది. మొత్తంగా చూస్తే, పల్లె వెలుగుల్లో ఏసి బస్సుల ప్రవేశం ప్రజాపక్ష పాలనకు మరో బలమైన ముద్ర. పల్లెకు గౌరవం ఇస్తూ, గ్రామీణ ప్రజల జీవితాల్లో నిజమైన మార్పుకు బాటలు వేసే ఈ నిర్ణయం భవిష్యత్తులో ఆదర్శంగా నిలవనుంది.

చార్జీలు పెరుగుతాయా..?

పల్లె వెలుగుల్లో ఏసీ బస్సులు అంటే సహజంగానే "చార్జీలు పెరుగుతాయేమో" అన్న సందేహం ప్రయాణికుల్లో నెలకొంది. అయితే ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయాల ప్రకారం సామాన్య ప్రయాణికులపై అదనపు భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. చార్జీల విషయంలో స్పష్టత గ్రామీణ ప్రజల అవసరాలనే కేంద్రంగా చేసుకుని ఈ ఏసీ బస్సులను ప్రవేశపెడుతున్న నేపథ్యంలో, చార్జీలను కూడా అందుబాటులోనే ఉంచాలన్నదే ప్రభుత్వ ఆలోచన. పట్టణ లగ్జరీ ఏసీ బస్సుల తరహాలో అధిక చార్జీలు వసూలు చేసే ఉద్దేశం లేదని, సాధారణ ప్రజలు కూడా వినియోగించుకునేలా ధరలను నిర్ణయించనున్నట్లు సమాచారం. మహిళలకు ఉచిత ప్రయాణం ఎలాంటి మార్పు లేదు. ముఖ్యంగా మహిళా ప్రయాణికుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడ లేదు. ఇప్పటికే అమలులో ఉన్న మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ఈ ఏసీ బస్సులకూ యథావిధిగా వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అంటే ఏసీ బస్సు అయినా, సాధారణ బస్సు అయినా మహిళలకు ఉచిత ప్రయాణంలో ఎలాంటి మార్పు ఉండదు. ప్రభుత్వ ఉద్దేశం ఇదే ఏసీ బస్సుల పేరుతో ప్రజలపై భారం మోపడం కాదు. గ్రామీణ ప్రజలకు గౌరవప్రదమైన, సౌకర్యవంతమైన ప్రయాణం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. అందుకే చార్జీల విషయంలో సమతుల్యత పాటిస్తూ, సంక్షేమ పథకాలకు భంగం కలగకుండా ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది.

కనీస వేతనాలు అమలు చేయాలి

ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు

విశాలాంధ్ర-కడప రూరల్ : ఆశాల సమస్యలపై పోరాటాలు అనేక మంది అధికారులకు, అధికార పార్టీ మంత్రులకు ఇచ్చిన వినతుల సందర్భంగా అధికారులు, మంత్రులు అంగీకరించిన ఆశాలకు సంబంధించిన అన్ని అంశాలపై జీవోలు విడుదల చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక ఏఐటియుసిఆఫీసులో యూనియన్ జిల్లా అధ్యక్షులు యు. మరియమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా జనరల్ బాడీ సమావేశంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి ఆశా కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిలుగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు మరియు ఏపీ జిల్లా గౌరవ అధ్యక్షులు గుంటి వేణుగోపాల్, జిల్లా మహిళా ఫోరం జిల్లా కన్వీనర్ యన్. విజయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లైన ఆశా కార్మికుల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్న అన్నారు. కనీస వేతనం 26వేలు చెల్లించాలని, భేటీ బచావో- బేటి పడావో నినాదాలు ఇస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి ఆశా వర్కర్ల సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. జనరల్ బాడీ సమావేశంలో తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించటం జరిగినది. కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, కార్మికులకు నష్టం చేకూర్చేలా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, ఆశావర్కర్లకు జాతీయ సెలవులు, పండగ, వారాంతపు సెలవులు, క్యాజువల్ సెలవులు, మెడికల్ లీవులు ఇవ్వాలని,రాజకీయ నాయకుల జోక్యాన్ని తొలగించాలని, ఆశా వర్కర్లు సర్వీస్ లో మరణిస్తే 10 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, దహన సంస్కారాలకు 20 వేలను ప్రభుత్వం ఇవ్వాలని, ఖాళీగా ఉన్నఆశా వర్కర్ల పోస్టులను భర్తీ చేసి పనివారం తగ్గించాలని, ఏఎన్ఎం, జిఎన్ఎం వంటి పర్మనెంట్ పోస్టుల నియామకాలలో శిక్షణ పొందిన ఆశా కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పించాలని తీర్మానించారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు శాంతమ్మ, లక్ష్మీ నరసమ్మ , వరలక్ష్మి, శోభారాణి, సరళ, పివి రమణమ్మ, ధోవతి, మున్ని, అమ్ములు, అనిత ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

పలు వివాహ వేడుకల్లో పిసిసి జనరల్ సెక్రెటరీ అల్లాబకష్

డిసెంబర్ 28న జరిగిన పెళ్లిలన్ని చరిత్రపుటల్లో నిలిచిపోతాయి

విశాలాంధ్ర - రాయచోటి :అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో జరిగిన వివాహ వేడుకల్లో డిసిసి మాజీ అధ్యక్షుడు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్ (సీఎల్బీ) పాల్గొన్నారు. పట్టణ ప్రముఖ వ్యాపారి హబీబుల్లా కుమారుడు ప్రముఖ డాక్టర్ షేక్ మహమ్మద్ అబ్బాస్ మరియు మహబూబ్ ఖాన్ కుమారుడు బాబ్జాన్ ఖాన్ వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అల్లాబకష్ మాట్లాడుతూ భారత దేశంలో డిసెంబర్ 28 న జరిగిన వివాహ వేడుకలన్నీ చరిత్ర పుటల్లో సువర్ణ అక్షరాలతో లిఖించబడుతుందని అన్నారు.ఎందుకంటే..జాతి పిత మహాత్మా గాంధీ, బిఆర్ అంబేద్కర్ లాంటి వారెందరో శ్రమించిన భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం కనుక డిసెంబర్ 28 న జరిగ పెళ్లిలన్ని చరిత్ర పుటల్లో సువర్ణ అక్షరాలతో నిలిచిపోతాయన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు

నెమ్మదిగా వెళ్ళండి గమ్యాన్ని చేరండి

విశాలాంధ్ర-రామాపురం : కర్నూలు - చిత్తూరు 40వ జాతియ రహదారిలోని రామాపురం మండల పరిధిలోని గ్రామ సరిహద్దు ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులను బోర్డులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కడప -జాతీయ రహదారిలోని రామాపురం మండల పరిధిలో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నారని ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఈ ప్రమాదల వల్ల కొన్ని కుటుంబాలు రోడ్డు పాలు అవుతున్నారని ఆయన. ముందు జాగ్రత్తలుగా గ్రామ సరిహద్దులలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాహనదారులు ప్రతి ఒక్కరు వాహనాల వేగాన్ని తగ్గించి వాహనాలు నడపాలన్నారు. ప్రతి వాహనదానికి పర్మిట్లు హెల్మెట్.కచ్చితంగా ఉండాలని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. సైకిల్ మోటార్ వాహన దారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని ఆయన తెలిపారు.

ప్రాజెక్టుకు చేరుకున్న హెచ్ఎన్ఎస్ఎస్ జలాలు

విశాలాంధ్ర-రామాపురం: హెచ్ ఎన్ ఎస్ ఎస్ కాలవ నుంచి కృష్ణా జలాలు మంత్రిమండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక చొరవతో హంద్రీనీవా సుజల స్రవంతి కాలవ ద్వారా వెలుగల్లు జలాశయానికి ఆదివారం నీరు చేరాయిని రామపురం మండలం చిట్లూరు గ్రామం టిడిపి యువ నాయకుడు చెన్నకేశవరెడ్డి తెలిపారు . ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గం పూర్తిగా కరువు ప్రాంతం కావడంతో వెలిగల్లు ప్రాజెక్టుకు నదులు అనుసంధాన పనులు పూర్తి చేసి నీళ్ల పొలాలకు పారించే ఉద్దేశంతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లడంతో నీటి పారుదల శాఖ అధికారులు సత్యసాయి జిల్లా నుంచి ప్రధానకారుల ద్వారా స్వల్ప అడ్డంకులు తొలగించుకుంటూ నేడు ఆదివారం ప్రయోగాత్మకంగా వెలిగల్లు ప్రాజెక్టులోకి హంద్రీనీవా సుజల స్రవంతి కాలువల ద్వారా నీటిని మళ్లించారు. ఇప్పటికే రామాపురం లక్కిరెడ్డిపల్లి మండలాలలో చెరువుల్లోకి నీళ్లు వచ్చి మరవలు పోతున్నాయని రైతులు వరి నాట్లు నాటుకుంటున్నారని నియోజకవర్గ ప్రజలు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గం ప్రజలకు మంత్రి చేసిన భగీరథ ప్రయత్నం నేటికీ రూపం దాల్చింది భవిష్యత్తులో బీడు భూములు పచ్చదనంతో నిండితాయని నియోజకవర్గ ప్రజలు ఆనందంగా ఉన్నారని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

దుద్దుకూరు వారి వివాహ మహోత్సవములో

ఎంపీ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా

విశాలాంధ్ర -అట్లూరు: బద్వేల్ మున్సిపాలిటీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 17వ వార్డు కౌన్సిలర్ దుద్దుకూరు సత్యనారాయణ, దుద్దుకూరు చంద్రకళ గార్ల కనిష్ఠ పుత్రిక కీర్తిశేషులు రాజకీయ కురవృద్ధుడు ఇరువురి రామయ్య మనవరాలు సోని వెంకట సాయి చందన్ తేజ వివాహ రిసెప్షన్ వేడుకలు ఆదివారం బద్వేల్ పట్టణం బయనపల్లి బొజ్జి రెడ్డి కళ్యాణ మండపం లో రాజకీయ నాయకులతోపాటు స్నేహితులు బంధువులు శ్రేయోభిలాషుల తో పాటు ఈ శుభకార్యానికి కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి , ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి , ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, సమృద్ధిగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన వధూవరుల ను ఆశీర్వదించారు.

రాష్ట్ర హ్యూమన్ రైట్స్ డిఫెన్స్ కౌన్సిల్ జనరల్ సెక్రెటరీగా మోడెం మదన్ మోహన్

విశాలాంధ్ర - రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలోని వీరబల్లి మండలానికి చెందిన మోడెం మదన్ మోహన్ ఏపీ హ్యూమన్ రైట్స్ డిఫెన్స్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. శనివారం తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని ప్రధాన కార్యాలయంలో రియాన్ అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ మండలి డైరెక్టర్ ఎంకే జాన్ వెస్లీ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు మదన్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమానవ హక్కులు వ్యక్తులకు వారి గౌరవాన్ని, హుందాతనాన్ని కాపాడుకోవడానికి, సమాజంలో సమానంగా జీవించడానికి శక్తినిస్తాయని అన్నారు. ప్రభుత్వాలు, ఇతరుల నుండి రక్షణ పొందేలా చేస్తాయని ఆయనన్నారు. ప్రజలకు అన్యాయం జరిగిన న్యాయపోరాటం చేసి హక్కులను కాపాడుటకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పదవి రావడానికి సహకరించిన డైరెక్టర్ ఎం.కె. జాన్ వెస్లీ, రియాన్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ చీఫ్ ఇంచార్జ్ షబ్బీర్, హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

మానవత సంస్థకు తోడ్పాటునందిస్తాం

: గ్రంథాలయ సంస్థ చైర్మన్ భాను ప్రకాష్

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు తన వంతు తోడ్పాటు నందిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భాను ప్రకాష్ అన్నారు. పులివెందులలో ఆదివారం మానవతా సంస్థ అధ్యక్షులు జి చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిను ఆయన మాట్లాడుతూ విద్యాధరి సంస్థల పేరుతోనే తాను ఎదిగినట్లుగా తాను మానవతా సంస్థ అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని,భాను ప్రకాష్ తో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులు చవ్వా కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా సమావేశాలకు కానీ, ఇతర మానవతా కార్యక్రమాలకు తన వాహనమును సమ కూ రుస్తానని తెలిపారు. గౌరవ అతిథి రిటైర్డ్ ఎంఈఓ డి సదాశివరెడ్డి, సంస్థ చైర్మన్ డివి కొండారెడ్డి, కౌన్సిల్ సభ్యులు చవ్వా కృష్ణారెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు జి చంద్రశేఖర్ రెడ్డి, ఎం.వి శేషయ్య మానవతా సంస్థ కార్యక్రమాలను వివరించారు. అంద యువకునికి ఆర్థిక సహాయం పులివెందల మానవతా సంస్థ అనిల్ అనే అంద యువకునికి వైద్య నిమిత్తమై రూ 5వేల ఆర్థిక సహాయం చెక్కును అందించారు. కౌన్సిల్ సభ్యులు చెవ్వా కృష్ణారెడ్డి వ్యక్తిగతంగా వెయ్యి రూపాయలు అందజేశారు. మానవత సమావేశంలో మానవతా సభ్యులు రాఘవరెడ్డి, లక్ష్మీ నారాయణ, రాజేశ్వర్ రెడ్డి తదితరులు ప్రసంగించారు.

జిల్లాగా రాయచోటనే కొనసాగించాలి

విశాలాంధ్ర- రామాపురం: అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటినే కొనసాగించాలని పి ఎస్ టి యు రాష్ట్ర మైనార్టీ నాయకుడు ముజాహుర లక్ తెలిపారు. ఆదివారం మండలంలోని నీలకంఠ రావు పేట లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా జిల్లా రాయచోటినే కొనసాగించాలని ఆయన తెలిపారు జిల్లా మారిస్తే ప్రజలు. ఉద్యోగులు. దుకాణ దారులు ఇబ్బంది పడవలసి వస్తుందని అయన తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలలో ర్యాలీలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంగా ప్రకటించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతారని ఆయన అన్నారు. ఈ ర్యాలీలో జమీల్. అలీ ఖాన్. అహ్మద్. అన్వర్.సమీర్ ఖాన్. యూన్స్.సలావుద్దీన్.సర్దార్. పాల్గొన్నారు.

వచ్చే ఏడాదిలోనూ విజయాలే

టిడిపి ఇన్‌చార్జి బిటెక్ రవి

విశాలాంధ్ర-పులివెందుల: వచ్చే ఏడాదిలోను అన్ని విజయాలే సాధిస్తామని టిడిపి ఇన్‌చార్జి బిటెక్ రవి ధీమా వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో 2025 సంవత్సరంలో సాధించిన విజయాలను ఆదివారం ఆయన విలేకరులకు వెల్లడించారు. బీటెక్ రవి మాట్లాడుతూ 2025 వ సంవత్సరం తమకు సంతృప్తి నిచ్చిందన్నారు. సాగునీటి ఎన్నికలలో 32 కు 32 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం తమ అదృష్టం అన్నారు. అలాగే తుంగభద్ర హెచ్ ఎల్ సి చైర్మన్గా మారెడ్డి జోగిరెడ్డి ఎన్నికయ్యారన్నారు. అదేవిధంగా పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నికల్లో విజయం సాధించామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎర్రబెల్లి చెరువును కృష్ణాజలాలు నింపామన్నారు. అలాగే వేముల మండలం కేకే కొట్టాల సమీపంలోని టైలింగ్ పాండ్ కు సంబంధించి భూములను తీసుకునేలా యురేనియం అధికారులను ఒప్పించామన్నారు. అరటి రైతులకు కూడా టన్ను దర 20 వేలకు పైగా పలుకుతుందన్నారు. పులివెందుల నుంచి ఇరువురు ముఖ్యమంత్రులుగా పనిచేసినా మంచినీటి సమస్య ఉందని వాళ్లే ఫిర్యాదు చేయడం సిగ్గుచేటన్నారు. తాను ప్రకటన ఇవ్వగానే ఆ సమస్య పైన వాళ్లు స్పందిస్తారన్నారు. పట్టణంలో విగ్రహాలు పెట్టడం తొలగించడం కోసం కోట్లాది రూపాయలు వృధా చేశారని ఆరోపించారు. పులివెందుల ప్రాంతం అభివృద్ధి తమ ధ్యేయమని బిటెక్ రవి వెల్లడించారు. విలేకరుల సమావేశంలో మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గద్దం అమర్‌నాథ్‌యాదవ్, టిడిపి నేత దేవిరెడ్డి సంజీవరెడ్డిలు పాల్గొన్నారు.

పురాణాలు సంస్కృతికి నిలయాలు

: పీఠాధిపతి కమలానంద భారతి స్వామి



విశాలాంధ్ర-పులివెందుల:: రామాయణం, మహాభారతం, భాగవతం వంటి పురాణాలు భారతీయ హైందవ సంస్కృతికి నిలయాలని గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కమలానంద భారతి స్వామి పేర్కొన్నారు. పులివెందుల పట్టణ పరిధిలోని వాసవి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో హిందువులు ఉండాలన్నారు. అలాగే దేవాలయాల ఐక్యతను చాటి చెప్పాలన్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి హిందువు చైతన్యవంతం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

గంజాయి బ్యాచ్ అరెస్టు : వాయల్పాడు సిఐ రాఘవరెడ్డి

విశాలాంధ్ర-గుర్రంకొండ : జిల్లా ఎస్పీ ధీరజ్ కొనుబిల్లి ఆదేశాల మేరకు, వాయల్పాడు సీఐ రాఘవరెడ్డి తన సిబ్బంది ఎస్సై రవీంద్రబాబు సిబ్బందితో బృందంగా ఏర్పడి శనివారం సాయంత్రం 4 గంటలకు చిట్టిబోయినపల్లె గ్రామ సమీపంలో రాయచోటి మదనపల్లి రోడ్డు పక్కన గల ఈదుల కుంట వాటర్ ట్యాంకు బండ వద్ద ఐదు మంది గంజాయి విక్రయాలు చేస్తూ ఉండగా వారిని పట్టుకొని వారి దగ్గర ఉన్న 5 కేజీల గంజాయిని స్వాధీన పరుచుకున్నారు. దాని విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని రాయచోటి ఎస్‌డిపిఓ కృష్ణమోహన్ విలేకరుల సమా వేశంలో తెలియజేశారు. అదుపులో తీసుకున్న వారిలో తనగాని వెంకటరమణ, 40 సంవత్సరాలు పసలవాళ్ళపల్లి ఎల్లుట్ల గ్రామం గుర్రంకొండ. గుటం సమ్ము సమీర్ 20 సంవత్సరాలు ఇందిరమ్మ కాలనీ గుర్రంకొండ. షేక్ మొహమ్మద్ సేఫ్ వయసు 19 సంవత్సరాలు గుర్రంకొండ. అరుణ్ కుమార్ వయస్సు 19 సంవత్సరాలు ఎర్రగన్న వారిపల్లి,తరిగొండ. మరొక ముద్దాయి మైనర్ బాలుడు. కృష్ణమోహన్ మాట్లాడుతూ వీధి నిర్మాణంలో ప్రతిభ కనబరిచిన సిఐ రాఘవరెడ్డి తమ సిబ్బంది ఎస్సై రవీంద్రబాబు, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు నాయక్, మరియు కానిస్టేబుల్స్ ముద్దాయిలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచినందున సిబ్బంది ప్రతి ఒక్కరిని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కొనబిల్లి అభినందనలు తెలియజేశారన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు.. ఉత్తర ద్వారం నుండి శ్రీవారి దర్శనం

విశాలాంధ్ర - ఎర్రగుంట్ల : హిందు వులకు అత్యంత పవిత్రమైన వైకుం ఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం జరగనున్న కార్యక్రమాలకు సంబంధించి వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చురు కుగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా స్థానిక సుందరయ్య నగర్ లోని పద్మావతి పురంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి, చిలమకూరులోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారం గుండా భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యం కల్పించనున్నారు. ఆ సందర్భముగా ఆలయాల్లో తెల్లవారు జామునుండే ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి. ఎర్రగుంట్ల లో ఆరోజు ఉదయం 5 గంటల నుండి భక్తులకు ఉత్తరద్వారా ప్రవేశం కల్పిస్తారు. 29వ తేదీ సోమవారం ఈ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకం జరగనుంది. ఉత్సవ నేపథ్యంలో బెంగుళూరు నుండి ప్రత్యేకంగా స్వామివారి అలంకరణకు పుష్పాలు తెప్పిస్తున్నారు. మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ నిర్వహకులు చేస్తున్నారు. ఆలయ సందర్శనకు ఉచిత రవాణా సౌకర్యం కూడా కల్పించారు. నాలుగు రోడ్ల కూడలి నుండి ఆలయం వరకు వాహన సౌకర్యం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉండడంతో ఆలయ నిర్వాహకులు తగిన సౌకర్యాలు కల్పిస్తున్నారు.

అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటినే కొనసాగించాలి

టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి వెంకట శివారెడ్డి

విశాలాంధ్ర-గాలివీడు: అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటినే కొనసాగించాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి వెంకటశివారెడ్డి కోరారు. ఆదివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా రాయచోటినే కొనసాగిస్తామని 2024 ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీని తప్పకుండా అమలు చేయాలని గాలివీడు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి వెంకట శివారెడ్డి డిమాండ్ చేశారు.ఇప్పటికే రాయచోటిలో జిల్లా కలెక్టర్ కార్యాలయం,ఎస్పీ కార్యాలయం సహా కీలక ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేయబడిన పరిస్థితుల్లో, వాటిని మరోచోటికి తరలించడం అంటే ప్రజాధనాన్ని నీళ్లలో పోసినట్లేనని ఆయన అన్నారు.ఇది కోట్ల రూపాయల ప్రజాధన వృథాకు, ప్రజలపై అదనపు ఆర్థిక భారానికి దారి తీస్తుందన్నారు.రాయచోటి నియోజకవర్గ ప్రజల మనోభావాలను కించపరిచేలా,అభివృద్ధిని అడ్డుకునేలా ఎలాంటి నిర్ణయాలను తెలుగుదేశం పార్టీ తీసుకోదన్న నమ్మకం ప్రజలకు ఉందని,ఆ విశ్వాసాన్ని వమ్ము చేయకూడదని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రం మార్పు పేరుతో రాజకీయ ప్రయోగాలు చేయడం తగదని,ఇది ప్రజల విశ్వాసానికి ఘాతుకమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.చంద్రబాబు నాయుడు గారిపై నమ్మకంతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని గెలిపించిన రాయచోటి ప్రజల విశ్వాసాన్ని,నమ్మకాన్ని నీరు కార్చవద్దని ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు. ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి అసలైన బలమని గుర్తించాలన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమే ఉండదని,రాయచోటినే అన్నమయ్య జిల్లా కేంద్రంగా కొనసాగించాలనే అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు.

రైల్వేకోడూరు ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని లేని పక్షంలో రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలన్న ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలా కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని వికలాంగులు పేర్కొన్నారు. 15 వ రోజు ఆదివారం విభిన్న ప్రతిభావంతులు సుబ్బనరసారెడ్డి, ధనంజయ, తిరుపాలు,తిరుమల రెడ్డి, వాహిద్,రామకృష్ణ, వేమయ్య, జ్యోతీశ్వరనాయుడు తదితరులు రిలే నిరాహారదీక్షల్లో కూర్చొన్నారు.విబిన్న ప్రతిభావం తులు మాట్లాడుతూ రాజంపేట జిల్లా సాధనే మా లక్ష్యం అన్నారు.పద కవితా పితామహుడు అన్నమయ్య పురిటిగడ్డను కాపాడుకుందామన్నారు. అన్నమయ్య పేరుకే మనుగడ లేకుండా చేసే స్వార్థ వరులను అడ్డుకుందామన్నారు.కూటమి నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, సిహెచ్ రమేష్ బాబు తదితరులు రిలే నిరాహారదీక్షలను ప్రారంబించారు.రిలే దీక్షలకు మద్దతుగా విద్యార్థులు,ప్రజా సంఘాలు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇజెఎసి, జెఎసి నాయకులు ముత్యాల పెంచలయ్య, ఎస్ఎన్ శ్రీనివాసులు,ఎ నరసింహారెడ్డి,ఎంవి కుమార్,ఎన్ సుధర్శన్ రెడ్డి, సుకుమార్, చంగల్ రాజు,అంకిపల్లె భువనేశ్వర్, బందారు మల్లిఖార్జున, మారెళ్ల రామకృష్ణ,మల్లెం హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చడం పెట్టడం పేదల కడుపు కొట్టడమే

కడప సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఆగ్రహం

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల : గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చడం పెట్టడం పేదల కడుపు కొట్టడమేనని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత కమ్యూనిస్టు జమ్మలమడుగు నియోజకవర్గ సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం ఎర్రగుంట్ల మండల సమితి కార్యాలయంలో జమ్మలమడుగు నియోజకవర్గ కార్యదర్శి మిడుతూరు ప్రసాద్ అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి కేంద్ర ప్రభుత్వ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై మోపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.ఇది అంతిమంగా పేదల కడుపు కొట్టడానికి పనికి వస్తుందన్నారు. ఎందుకంటే 90 శాతం నిధులు కేంద్రం ఇచ్చేటప్పుడే రాష్ట్రం 10% నిధులతో ఎక్కువ ఉపాధి హామీ పనులను నిర్వహించేందుకు అవకాశం ఉందని అలా కాకుండా 60 శాతం కేంద్రం 40% రాష్ట్రం భరించాలన్న కేంద్ర నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే రైతులకు అవసరమయ్యే ఎరువుల ధరలను ఇబ్బడి ముబ్బడిగా పెంచి రైతాంగం నడ్డి విరగొట్టేందుకు, కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకు ప్రయత్నం చేయడమే నన్నారు. ఇవాళ రైతులు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అగమ్య గోచరంలో ఉన్నా పట్టించుకునే నాథుడు లేడు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని 101 వ సంవత్సరంలో అడుగు పెడుతున్న వేళ 2026 జనవరి 18 తారీకున ఖమ్మంలో లక్షలాదిమంది కార్యకర్తలతో ఎర్ర సముద్రాన్ని తలపించే విధంగా బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ బహిరంగ సభ ద్వారా కేంద్రానికి హెచ్చరిక పంపి ప్రజా కార్మిక కర్షక వ్యతిరేక విధానాలు విడనాడాలని ఆ దిశగా ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవి సుబ్బారెడ్డి, ఎస్ చాంద్ భాషా, ఎం నారాయణ, కొండాపురం మండల కార్యదర్శి ఎం. మనోహర్ బాబు, వై వి సుదర్శన్ రెడ్డి, వెంకటరమణ, ప్రసాద్, సుబ్బారావు, ఓబుల్ రెడ్డి, రమేష్, భవాని శంకర్, బ్రహ్మం రెడ్డి, శివారెడ్డి, సంజీవ రాయుడు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మానవత గాలివీడు శాఖకు రెండు బాడీ ఫ్రీజర్లు విరాళం

విశాలాంధ్ర-గాలివీడు: జిల్లా పరిషత్ హైస్కూల్ గాండ్లపల్లిలో పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన కె. రామకృష్ణారెడ్డి సోదరుడు కె. జయరాం రెడ్డి,అల్లుడు టంటం రామకృష్ణారెడ్డి మానవత సేవలకు గుర్తుగా రెండు బాడీ ఫ్రీజర్ బాక్సులను (ఒక్కొక్కటి రూ.80 వేల విలువ) మానవత గాలివీడు శాఖకు విరాళంగా అందజేశారు.మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గాలివీడు శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పరిషత్ బాయ్స్ హై స్కూల్‌లో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి మానవత సంస్థ వ్యవస్థాపకులు ఎన్. రామచంద్రారెడ్డి (రిటైర్డ్ ప్రిన్సిపాల్) అధ్యక్షత వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత గాలివీడు శాఖ వద్ద ప్రస్తుతం మొత్తం ఐదు బాడీ ఫ్రీజర్లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన గ్రామాలకు వీటిని ఉచితంగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.సేవాభావంతో మరిన్ని మంది సభ్యులుగా చేరి మానవత సేవల్లో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో కె. శివారెడ్డి,టి.వి.రమణారెడ్డి, చలపతి,చంద్రశేఖర్ రాజు, నాగముని రెడ్డి,బీవీఆర్ నాయక్,లక్కిరెడ్డిపల్లి, రాయచోటి మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు,మానవతా సంస్థ ,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు ఉన్నా పనులకు అడ్డుపడుతున్న దళితులు - స్థలం దారులు ఆరోపణ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అరుంధతీవాడ సమీపంలోని భూములకు అన్ని డాక్యుమెంట్లు ఉన్నా పనులకు దళితులు అడ్డుపడుతున్నారని తులసి హైస్కూల్ అధినేత తులసి,ప్లాట్లు కొన్న బాధితులు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం పాత బజారులోని గంగమ్మ గుడి సమీపంలో ఉన్న బత్యాల భవన్‌లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 7 లో గాదిరెడ్డి వెంకట్రామయ్య ద్వారా శోడిశెట్టి శేషయ్య 9 నవంబర్ 1932 లో డాక్యుమెంట్ నెంబరు 1835/1832 లో 7/1 లో 1.45 సెంట్లు,7/2లో 1.04 సెంట్లు,7/3 లో 2.87 సెంట్లు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అన్ని ఆధారాలు మా దగ్గర ఉన్న భూమిలో పనులు జరగనివ్వకుండా దళితులు అడ్డుపడుతన్నారన్నారు. ప్లాట్లలో పనులు మొదలు పెట్టినప్పుడల్లా రాజశేఖర్‌తో పాటు మరి కొంతమంది దళితులు రాళ్లు,కత్తులు, రాడ్లు తీసుకునివచ్చి దాడులకు తెగబడుతున్నారన్నారు. మొన్న జరిగిన దాడులలో కొంత మంది గాయాలకు గురయ్యారన్నారు.స్థలం కొనుగోలు దారులకు న్యాయం చేయాలని,భద్రత కల్పించాలని స్థానిక పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశామన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-వాల్మీకిపురం: దేశంలో ప్రజాస్వామ్యం సామాజిక న్యాయం, లౌకికతత్వం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, స్వాతంత్ర్యం, రాజ్యాంగం అందించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి బాలిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చింతపర్తి గాంధీ బస్టాండులో కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ అనేనినాదంతో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్పార్టీకి మద్దుతు ఇవ్వాలని కోరారు. అనంతరం గాంధీ బస్టాండులో కేకకోసి నిరు పేద పిల్లలతో పాటు కాంగ్రెస్ నాయకులకు పంచి పెట్టారు. అనంతరం బాలిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత భాజపా పాలనలో దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల తదితర సమస్యలతో ప్రజలు సతమతమౌతున్నారని, ప్రజల తరుపన కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రంకొండ, కలికిరి మండల పార్టీ అధ్యక్షులు ఫిరోజ్, ఆదినారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సమీర్, నాయకులు మస్తాన్, చిన్నక్రిష్ణ, గౌస్ నరసింహులు, కాంగ్రెస్నయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయజ్యోతిచే 'విశాలాంధ్ర' క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం శ్రమిస్తున్న విశాలాంధ్ర పత్రిక ప్రజల గొంతుక అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎన్‌డి విజయజ్యోతి, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ సయ్యద్ గౌస్‌పీర్‌లు పేర్కొన్నారు. ఆదివారం డీసీసీ కార్యాలయంలో విశాలాంధ్ర 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యల కోసమే పాటుపడుతూ 73ఏళ్లుగా అవిశ్రాంత పోరాటం చేస్తున్న విశాలాంధ్ర దినపత్రికకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్లబాబు, డివిజన్ ఇన్‌చార్జిలు దాసరి శ్రీనివాసులు, షామీర్ హుసేన్, సయ్యద్ రహంతుల్లా, రఫీక్‌ఖాన్, సిద్దిక్, మహిళా నాయకురాలు సంజయకాంత, గౌరీదేవి, పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అయ్యా.. చంద్రబాబూ మా గోడు పట్టించుకోండి

పార్లమెంట్‌లో ఎస్టీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెట్టించండి

విశాలాంధ్ర-మదనపల్లె : అయ్యా.. ముఖ్యమంత్రి చంద్రబాబు మా గోడు పట్టించుకోండి. సుదీర్ఘ కాలంగా పోరాటాల ఫలితం అసెంబ్లీలో ఆమోదించిన వాల్మీకిబోయల గిరిజన రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టించి, ఆమోదింప చేసే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురండి అంటూ వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పొదల నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విఆర్ఎస్ఎస్ పార్టీ కార్యాలయం లో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పొదల నరసింహులు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీలో చేర్చే విషయంపై ఇటీవల అసెంబ్లీలో మాజీమంత్రి కాలువ శ్రీనివాసులు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పార్లమెంట్‌లో చర్చించినా కొలిక్కి రాకపోవడం దారుణమన్నారు. 2017 డిసెంబరు 2న అసెంబ్లీలో వాల్మీకి బోయలను గిరిజనులుగా గుర్తించాలని బిల్లును ఆమోదించి, పార్లమెంట్‌కు పంపినా నేటికీ పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు.ఈ కార్యక్రమంలో బొగ్గిటి కృష్ణమూర్తి, వాల్మీకిపురం విష్ణు, ఉలసల మంజు, నరసింహులు, రెడ్డిశేఖర్, శ్రీనాథ్, రవి కుమార్, భాను ప్రకాష్, జయచంద్ర, ప్రవీణ్, పురుషోత్తం, సందీప్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి క్షేత్రస్థాయిలో శిక్షణ

విశాలాంధ్ర-చింతకొమ్మదిన్నె : కడప జిల్లా ఇపెంట పంచాయతీ ఇప్పెంట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మెంటార్ ఇంటెన్స్ వెంకటేష్ పొలంలో, కృషి విజ్ఞాన్ కేంద్రం నందు వివిధ పంటలు వివిధ రకాల బయోడైవర్సిటీ క్రాప్స్, 365 రోజులు పంటలు ఉండేలా సోయింగ్ విధానం,భూమిలో సారవంతం కావడానికి ఘన జీవామృతం,మొక్కలకు పోషకాలు, పురుగులు తెగులు నివారణ కొరకు అలాగే పెరుగుదలకు వాటి వలన ఉపయోగాలు ప్రధానంగా ఏ గ్రేడ్ మోడల్ జామలో వివిధ పంటలు పద్ధతి గురించి వాటిలో దోమ, వివిధ పురుగులను గమనించారు. కొత్తపల్లి గ్రామంలో శ్రీనివాసులు పొలంలో స్మార్ట్ ఫామ్‌లో కూరగాయలు మోడల్ గురించి తెలుసుకున్నారు. అలాగే ఇపెంట గ్రామంలో బయో రిసోర్స్ సెంటర్ కృష్ణయ్య ఆలంబిస్తున్న వాటిని విజిట్ చేసి అక్కడ రైతులకు అందుబాటులో ఉన్న వివిధ కషాయాలు ఇన్పుట్స్ విజిట్ చేశారు. అలాగే అక్కడ ఘనజీవంతం ప్రిపరేషన్ చేసి వాటి గురించి తెలుసు కున్నారు.

మృతదేహాన్ని ఇంట్లోకి రానివ్వకుండా అడ్డుకున్న యజమాని

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పొద్దుటూరు పట్టణంలోని శ్రీనివాస్ నగర్‌లో నివాసం ఉంటున్న ఎలక్ట్రీషియన్ బాష గుండెపోటుతో మృతి చెందడంతో అంబులెన్స్‌లో ఇంటికి తీసుకురాగా మృతదేహాన్ని ఇంటి యజ మాని ఇంటిలోనికి రానివ్వకుండా అడ్డుకున్నారు. గత 6సంవత్సరాలుగా ఇంటి అద్దెలో ఉంటూ అద్దె తీసుకుంటూ మృతి చెందిన తర్వాత మృతదేహాన్ని ఇంటిలోకి రానివ్వక పోవడంతో మృతుని బంధువులు, ఇంటి యజమాని మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలం చేరుకొని ఇంటి యజమానితో చర్చించి సమస్యను పరిష్కరించారు.

వివాహ వేడుకల్లో పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల

విశాలాంధ్ర- పీలేరు : పీలేరులోని యం.యం.ఫంక్షన్ హాల్ నందు పీలేరు పట్టణం అజంతా టాకీస్ రోడ్డుకు చెందిన పి.రెడ్డి ఖాన్ కుమారుడు పి. జావిద్ ఖాన్ వివాహ మహోత్సవ కార్యక్రమంలో ఆదివారం పీలేరు నియోజకవర్గం మాజీ శాసన సభ్యులుచింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు.

భారతదేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఎనలేనిది

విశాలాంధ్ర- మదనపల్లె : భారత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం బెంగళూరు బస్టాండులోని దివంగత మాజీ ప్రధాని ఇందిరమ్మ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్ కె బాష, తదితరులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్.కె.బాషా మాట్లాడుతూ దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ, పేదల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకానికి ఎన్డీఎ ప్రభుత్వం తూట్లు పొడుస్తూ పేద ప్రజల పొట్టకొట్టేలా విబిజి రాంజీ వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ ఔర్ అజ్వీక్ మిషన్ పథకాన్ని మార్చడంపైన అభ్యతరం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు.

మాజీ సర్పంచ్ పై దాడి

విశాలాంధ్ర- మదనపల్లె : మాజీ సర్పంచ్ పై కొందరు యువకులు దాడి చేశారు. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితుడు తాలూకా పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. కోటవారిపల్లి మాజీ సర్పంచి రాజా మదనపల్లె నుంచి స్వగ్రామానికి కారులో బయల్దేరాడు. మార్గమధ్యంలోని ఈశ్వరమ్మ కాలనీ వద్ద కొంతమంది యువకులు కారుకు అడ్డు వచ్చి గొడవ చేశారు. దీంతో మాజీ సర్పంచి కారు దిగి బయటకు రాగానే వాగ్వాదానికి దిగి మూకుమ్మడిగా దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దాడికి పాల్పడ్డవారిపై తగుచర్యలు తీసుకోవాలని, ఎస్సై చంద్రమోహన్‌కు గ్రామస్తులతో కలసి మాజీ సర్పంచి రాజా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారించి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

నిత్యావసరాలు పంపిణీ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : బి కోడూరు మండలం మేకవారి పల్లె గ్రామంలో నివాసముంటున్న వర్ర లావణ్య రెండు నెలల క్రితం ఆటోలో వెళ్తూ ప్రమాదానికి గురై ఒక కాలు ఫ్రాక్చర్ అవటంతో ఏ పని చేయలేక ఇంట్లోనే ఉండటంతో ఏదైనా చిన్న సహాయం చేసే వాళ్ళు ఉంటే చేయగలరు అని తెలుపటం తో, అదే చుట్టూ పక్కల గ్రామం లో స్కూల్ టీచర్ గా పని చేస్తున్న ఫ్రెండ్స్ సేవ సంస్థ సభ్యుడు కొండయ్య సార్ దృష్టికి రావటం వలన వారి కుటుంబానికి ఒక నెలకు సరిపడు నిత్యా అవసర సరుకులు మరియు 25 కేజీల బియ్యం సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ సేవ సంస్థ సభ్యులు కొండయ్య సార్, అనిగాని శివయ్య, ఫ్రెండ్స్ సేవ సంస్థ మహిళా సభ్యురాలు జ్యోతి, పోరుమామిళ్ళ చంద్రకళ, పాల్గొన్నారు.

రాయచోటిలో భారీ నిరసన

విశాలాంధ్ర -రాయచోటి : అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రాన్ని మదనపల్లికి ఆ కలుపుతున్న సోషల్ మీడియాలో వస్తున్న వార్తలకు ఆదివారం రాయచోటి జిల్లా కేంద్రం కొనసాగించాలంటూ రాయచోటి పట్టణంలో భారీ నిరసన ర్యాలీకి సంఘీభావం తెలిపి,ర్యాలీలో పాల్గొన్న నియోజకవర్గ జనసేన పార్టీ పి. ఓ. సి మయాన మహమ్మద్ అలీ పఠాన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023లో ఆగస్టులో ప్రతిపాదన చేసిన అన్నమయ్య జిల్లాను , మదనపల్లిలో కలపడం రాయచోటి నియోజక వర్గం వాసులకు ఇబ్బందికరంగా ఉంటుంది, రాజంపేటను, కోడూరును , రాయచోటిని మూడు ముక్కలు చేయడం చాలా బాధాకరం రాయచోటి నీ కేంద్రంగా కొనసాగించాలని జనసేన పార్టీ తరపున భారీగా ర్యాలీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు, కూటమి కార్యకర్తల్లో, విజయవంతం చేశారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం..

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : మానవతా స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో అనంతపురానికి చెందిన కిమ్స్ సవేరా ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక గౌతమ్ హై స్కూల్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయింది. ముఖ్యఅతిథిగా అర్బన్ సిఐ విశ్వనాథరెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. 150 మందికి ఓపీలు నిర్వహించగా 135 మంది రోగులకు ఈసీజీ టు డి ఏకో పరీక్షలు నిర్వహించారు. న్యూరో వైద్య నిపుణులు కార్తీక్ రెడ్డి, గుండె వైద్య నిపుణులు ఆదిశేషు వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఐదు గురిని అత్యవసర చికిత్సల కై కిమ్స్ కు రెఫర్ చేశారు. కార్యక్రమంలో మానవతా చైర్మన్ రఘురామిరెడ్డి, అధ్యక్షులు ఎస్. మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఉపేంద్ర రెడ్డి తోపాటు డాక్టర్ రామాంజనేయరెడ్డి, జీ రెడ్డి మల్లికార్జున్ రెడ్డి, జక్కు చెన్న కృష్ణారెడ్డి, సోమేశ్వర్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, టీచర్ రంగయ్య, భాస్కర్, సాంబశివరెడ్డి, రాజారెడ్డి, రామ సుబ్బారెడ్డి, ఆర్ఎంపి వైద్యులు రాజారెడ్డి, కత్తి ప్రతాపరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి పలువురు పాల్గొన్నారు. మానవతా స్వచ్ఛంద సంస్థ ఉచిత వైద్య సేవలు అందించడంపై సిఐ విశ్వనాథరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

"రోడ్డు ప్రమాదాలకు ప్రభుత్వాలదే బాధ్యత"



విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రభుత్వాలదే బాధ్యత అని, ప్రమాదాల్లో మరణించిన లేదా గాయపడిన వారికి తగిన నష్ట పరిహారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వాల మీద ఉందని అభ్యుదయ వేదిక కడప జిల్లా అధ్యక్షుడు పి.హైదర్ వల్లి అన్నారు.కడప యస్.టి.యు.భవన్‌లో జరిగిన అఖిల భారత అభ్యుదయ వేదిక కడప జిల్లా శాఖ సమావేశంలో అధ్యక్షుడు పి.హైదర్ వల్లి మాట్లాడుతూ ఇటీవల కాలంలో విపరీతంగా రోడ్డు,రైలు ప్రమాదాలు జరుగుతున్నా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కంటితుడుపు చర్యలు చేపట్టడం తప్ప,ప్రమాదాల నివారణకు పటిష్ఠమైన చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు.అభ్యుదయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వి.గంగా సురేష్ మాట్లాడుతూ ప్రైవేటు బస్సుల యజమానుల ధనదాహానికి అభం శుభం తెలియని ప్రయాణీకులు బలికావడం శోచనీయమన్నారు.అభ్యుదయ వేదిక రాష్ట్ర కార్యదర్శి కె.సురేష్ బాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం ఉన్న రవాణా చట్టాలను మార్చవలసిన అవసరం ఉందన్నారు.ప్రమాదాలకు కారణమైన వారికి త్వరగా శిక్షలు పడే విధంగా న్యాయ సంబంధిత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియచేశారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ అసత్య ఆరోపణలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలో స్వచ్ఛ కడప - మన కడప పర్యటనలో భాగంగా పోలీట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి రెడ్డి పర్యటిస్తూ టీడీపీ సీనియర్ నాయకులతో సరదాగా మాట్లాడే మాటలలో తప్పుడు అర్థాలను వెతికి శ్రీనివాస్ రెడ్డి అక్రమ వసూళ్లకు పాల్పడు తున్నారంటూ అన్యాయంగా డబ్బులు దందా చేస్తున్నారంటూ పూర్తి వీడియో చూపకుండా వీడియోని కట్ చేసి వైకాపా రాష్ట్ర సోషల్ మీడియా చేస్తున్నటువంటి అసత్యపు ప్రచారాలను తిప్పి కొట్టే క్రమంలో ఆదివారం నగర అధ్యక్షులు మన్సూర్ అలీ ఖాన్ ప్రధాన కార్యదర్శి ముక్కర సుబ్బారెడ్డి మాట్లాడారు.కడప నగర ప్రజా ప్రయోజనాల కోసం సంఘ విద్రోహ శక్తుల నుండి మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన యువతను రక్షించాలని ఆధునిక సాంకేతికతను ఆధారం చేసుకుని పోలీసు రక్షణ వ్యవస్థకు తోడుగా నిలిచే కడప నగరానికి నిఘానేత్రం ఏర్పాటు చేయాలని ఉద్దేశంతో మా నాయకుడు శ్రీనివాసులు రెడ్డి పై అసత్య ఆరోపణలు చేస్తున్నాడు సరికాదని అన్నారు. కడప ప్రముఖులు చేతనైన సహాయం చెయ్యాలని తద్వారా కడపంతటా సీసీ కెమెరాలు బిగించి అసాంఘిక శక్తులకు అడ్డాగా మారకుండా, దొంగతనాలు కానీ, ప్రమాదాలు కానీ ప్రజలకు కలిగే ఇబ్బందులను సకాలంలో గుర్తించగలిగేందుకు సీసీ కెమెరాల వలన ప్రయోజనం కలుగుతుందనే మంచి ఉద్దేశంతో ముందుకెళ్తున్నటువంటి గొప్ప నాయకుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు కోసం డొనేషన్ల రూపంలో ఎంత కలెక్ట్ అయినా పర్వాలేదు మిగతా డబ్బు తన సొంత నిధులతో కేటాయిస్తానని మాట ఇచ్చినటువంటి గొప్ప నాయకులు శ్రీనివాస్ రెడ్డి అని తెలియజేశారు. దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులకు తగ్గిన బుద్ధి గుణపాఠం తమతో పాటు ప్రజలు కూడా త్వరలోనే చెబుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వేర్హౌస్ చైర్మన్ శ్రీధర్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు బోనం శిలాస్ వెంకటేష్ ఆచారి , సుబ్బరాయుడు , 30వ డివిజన్ టిడిపి ఇంచార్జ్ జియావుద్దీన్ ,41 డివిజన్ ఇంచార్జ్ అఫ్జల్ , 7 వ డివిజన్ ఇంచార్జ్ వెంకటరమణ, టిడిపి కార్యకర్తలు తోసిఫ్ హుస్సేన్, పాల్గొన్నారు.

హిందూ సంఘటితాన్ని చాటిన హిందూ సమ్మేళనం

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 100 సంవత్సరాల ఉత్సవాలలో భాగంగా హిందువులందరూ ఏకమయ్యే దిశగా ఏర్పాటు చేసిన హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని హిందూ సమ్మేళన స్వాగత కమిటీ ఘనంగా నిర్వహించింది. ఎర్రగుంట్ల పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్ నందు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీశ్రీశ్రీ ఆచార్య అభినవ శంకరానంద స్వామీజీ (వేదాంత గీత శివం ఫౌండేషన్, చాగలమర్రి), ఉత్తర దక్షిణ ప్రాంతాల సంఘటన కార్యదర్శి (విశ్వహిందూ పరిషత్) శ్రీనివాసులు రెడ్డి, అతిథులుగా రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శివ సుప్రియ, బాలాజీ పాల్గొన్నారు. ముందుగా కోలాటం, భరతనాట్యం, భగవద్గీత శ్లోకాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య వక్త శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ప్రారంభించినప్పటి నుంచి ఎన్నో ఒడిదుడు కులను ఎదుర్కొంటూ హిందూ సంఘటన కొరకు కృషి చేస్తున్నదని తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీశ్రీశ్రీ అభినవ శంకరానంద స్వామీజీ మాట్లాడుతూ హిందువులందరూ సంఘటితంగా ఉండాలని రాబోవు తరాలకు మన సాంప్రదాయాలు అందించాలని తెలిపారు.హిందుత్వం లేని భారతదేశాన్ని ఊహించలేమని, ప్రపంచంలో కెల్లా ఇతర సామ్రాజ్యాలపై దండెత్తని జాతి హిందూ జాతి అని గర్వంగా చెప్పగలమని, మన దేవీ దేవతలకు కూడా ఆయుధాలు కలిగి ఉంటారని, అవసరమైనప్పుడు అస్త్రాలను ఉపయోగించాలని సభా ముఖంగా తెలపడం జరిగినది.అతిథిగా విచ్చేసిన రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ హిందుత్వం బలపడిందని, హిందువుగా జన్మించడం మన పూర్వజన్మ సుకృతమని, రాబోవు తరాలు హిందువులే భారతదేశాన్ని ముందుకు తీసుకెళ్తారని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో 1500 పైగా హిందూ బంధువులు పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.